క్లుప్తంగా

సాగర్ జలాలతో చెరువులను నింపాలి



శావల్యాపురం: సాగర్ జలాలతో మంచినీటి చెరువుల్ని పూర్తిస్థాయిలో నింపాలని ఎన్నెస్పీ డీఈ సీహెచ్.రామారావు సూచించారు. సోమవారం శావల్యాపురంలో మంచినీటి చెరువును ఎన్నెస్పీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాలు విడుదల చేసినట్లు చెప్పారు. మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపాన ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఎనిమిది మంచినీటి చెరువుల్ని సాగర్ జలాలతో నింపాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ ఉన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు దాతలు 150 భోజనం ప్లేట్లు పంపిణీ అందజేసినట్లు హెచ్ఎం షేక్ మాబు సుభాని సోమవారం తెలిపారు. వివేకానంద పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి గట్టుపల్లి వీరాస్వామి, ఎల్ఐసీ డెవలప్‌మెంటు అధికారి ఎస్.వాసు సంయుక్తంగా రూ. 10 వేల విలువైన స్టీల్ ప్లేట్లు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జె.శ్రీనివాసరావు, రత్నలత, మరియదాసు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



వినుకొండ టౌన్: అమ్మ సోషల్ ఆర్గనైజేషన్ ప్రారంభం సందర్భంగా సోమవారం 200మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. ఆర్గనైజేషన్ సభ్యులు గోనుగుంట్ల కిశోర్, సాతినేని మహేష్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం, వారానికి ఒకసారి పేదలకు అన్నదానం చేసేందుకు నూతనంగా ఆర్గనైజేషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పిడుగు విజయ్, నిదానపు చిన్న సైదులు, రహిమాన్, అబ్దుల్లా, నరసింహారావు, శ్రీను, బి. అనిల్, వెంకట కృష్ణ పాల్గొన్నారు.

సినారే కవిత్వం నిత్య నూతనం

చిలకలూరిపేట: ఆధునికాంధ్ర కవుల్లో నిత్య నూతన కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి అని ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పి.వి. సుబ్బారావు పేర్కొన్నారు. సినారే జయంతిని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌కేకే ఎస్‌సీవీఎస్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ 70 కావ్యాలు, వేలాది సినీ గీతాలు రాసి సినీ ప్రేక్షకులు, పాఠకుల హృదయాల్లో సుస్థిరంగా సినారే నిలిచారని పేర్కొన్నారు. ఆధునిక విమర్శలో ప్రామాణికమైన ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయం– ప్రయోగాలు అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించారని వెల్లడించారు. రాజ్యసభ సభ్యుడిగా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా, అవిభక్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా గొప్ప సేవలు అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి సినారే అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ పద్మభూషణ్ బిరుదుతో పాటు అనేక అవార్డులు ఆయనకు లభించాయని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీస్ మహాసభను విజయవంతం చేయండి

నకరికల్లు: హైదరాబాద్‌లో ఈ నెలలో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కనుమూరి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. నకరికల్లులో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించి పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలం సమావేశాల్లో పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో భారీఎత్తున సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి మండల కేంద్రంలో మాదిగల విశ్వరూప సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు జె.నరసింగరావు, బొక్కా వెంకటేశ్వర్లు, గుజ్జుల పౌలు, కొత్తపల్లి మరియదాస్, బొక్కా శేషగిరిరావు, కె.మహేష్, కె.జకరయ్య పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింస దుర్మార్గం, దారుణం

- పట్టణంలోని సార్వత్రిక క్రైస్తవ, హిందూ, ముస్లింల ర్యాలీ
- పాల్గొని సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- క్రిస్టియన్‌పాలెం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ



ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, పలువురు నాయకులు, పాస్టర్లు

నరసరావుపేట: మణిపూర్‌లో గత కొన్నిరోజులుగా జరుగుతున్న హింసాత్మక చర్యల్ని ప్రతిఒక్కరూ ఖండించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో క్రైస్తవ, హిందూ, ముస్లింలు ప్లకార్డులతో చేపట్టిన శాంతి ర్యాలీలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. క్రిస్టియన్‌పాలెంలోని చర్చి దగ్గర నుంచి ప్రారంభమై కలెక్టరేట్ వరకు కొనసాగిన ర్యాలీలో వారితో కలసి నడిచారు. మధ్యలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడే హింసను వ్యతిరేకిస్తూ పాస్టర్లు చేసిన ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ సభ్య సమాజం సిగ్గుపడేలా స్త్రీలను వివస్త్రను చేసి అత్యాచారం చేయడాన్ని దేశంలోని అన్ని పత్రికలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులు తీవ్రంగా ఖండించారన్నారు. ముస్లింలు, క్రైస్తవులు, దళితులు, గిరిజనులపై దాడుల చేస్తూ దుర్మార్గమైన మారణకాండకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం, అక్కడి రాష్ట్ర ప్రభుత్వంపై ఉంద తెలిపారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం హింసను ఆపేందుకు నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. హింసను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వారికి వైఎస్సార్ సీపీ సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నట్లు ప్రకటించారు. ఇటువంటి సంఘటనలు మరోసారి దేశంలో ఎక్కడా జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీబీఐ అధికారులు నిస్పక్షపాతంగా వ్యవహరించి దోషుల్ని అరెస్టు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో శాంతిభద్రతల్ని సాధ్యమైనంత త్వరగా కాపాడాలని కేంద్రాన్ని కోరారు. కార్యక్రమంలో మాదిగ, గిరిజన, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు కందుల ఎజ్రా, పాలపర్తి వెంకటేశ్వరరావు, ఎస్.సుజాతాపాల్, టౌన్ బాప్టిస్టు చర్చి అధ్యక్షుడు పంగులూరి విజయకుమార్, ఆంధ్రా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కాల్వ రవి మాదిగ, ఎస్సీ సెల్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు మల్లెల అశోక్, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి మద్దిరెడ్డి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ నెలటూరి మురళి, క్రైస్తవ, హిందూ, ముస్లిం మైనార్టీ నాయకులు, ప్రజా సంఘాలు, పెద్దఎత్తున మహిళలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లిష్‌కు పెరిగిన ప్రాధాన్యం



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: లింగంగుంట్లలోని బీసీ వెల్ఫేర్ బాలికల పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. భోజనశాల, తరగతి, వసతి గదుల్ని పరిశీలించారు. భోజనశాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని చెప్పారు. తరగతి గదిలో విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో సౌకర్యాల్ని అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలలోని పలు ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాల్ని పరీక్షించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పంపిణీ చేసి, వారితో కలసి తిన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాల్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాల్ని అధిరోహించాలని చెప్పారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లిష్‌కు ప్రాధాన్యత పెరిగిందని, విద్యార్థినులు తరగతి గదిలో తప్పనిసరిగా మాట్లాడేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా ఈ దిశగా కృషిచేయాలని తెలిపారు కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్సీ సెల్ మానటరింగ్ కమిటీ సభ్యుడు మల్లెల అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరు దివ్యాంగులకు త్రిచక్ర వాహనాల పంపిణీ



కలక్టరేట్‌లో త్రిచక్ర వాహనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలోని ఇద్దరు దివ్యాంగులకు సోమవారం ఉచితంగా త్రిచక్ర వాహనాల్ని కలెక్టర్ ఎల్.శివశంకర్ అందజేశారు. త్రిచక్ర వాహనాల పంపిణీ కోసం ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో ఇటీవల జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గం మాచవరం మండలానికి చెందిన మట్టపల్లి ప్రకాశరావు, సర్వేపల్లి సునీత తమకు త్రిచక్ర వాహనాల్ని ఎలాగైనా ఇప్పించాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను కలసి వేడుకున్నారు. స్పందించిన వారిద్దరూ హైదరాబాద్‌కు చెందిన వర్చు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. త్రిచక్ర వాహనాలను వచ్చేలా చూడాలని జిల్లా దివ్యాంగుల సహకార సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్తను ఆదేశించారు. దీనిపై మానవత్వంతో స్పందించిన కంపెనీ ప్రతినిధులు రూ.1.70లక్షల విలువైన రెండు త్రిచక్ర వాహనాల్ని కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. వాహనాలు అందుకున్న దివ్యాంగులు తమకు చేసిన సహాయానికి ఎప్పుడూ రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సహకార సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త, నవోదయం నోడల్ అధికారి సంజీవ్‌రావు, కలెక్టరేట్ ఏఓ అనీల్‌కుమార్, తహసీల్దార్ రమణా నాయక్ పాల్గొన్నారు.

చెరువుల్లో సాగర్ జలాల గలగలలు



గణపవరం చెరువును పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

నాదెండ్ల: మండలంలో తాగునీటి చెరువులకు సాగర్ జలాలు చేరిక కొనసాగుతోంది. బుధవారం కల్లా అన్ని చెరువులు నూరు శాతం నీటితో నిండుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ తెలిపారు. తుర్లపాడు మేజర్ కాలువ పరిధిలో గణపవరం, ఎండుగుంపాలెం, అప్పాపురం రక్షిత మంచినీటి చెరువులు నిండు కుండల్లా మారాయి. నాదెండ్లలోని మూడు చెరువులకుగాను రెండు చెరువులు 95 శాతం, మూడో చెరువు 75 శాతం, కనపర్రు చెరువు 95 శాతం నీటితో నిండాయి. పెదనందిపాడు బ్రాంచి కెనాల్ పరిధిలో చందవరం 85 శాతం, గొరిజవోలు 75 శాతం నిండాయి. చిరుమామిళ్ల మేజర్ పరిధిలోని సంకురాత్రిపాడు, చిరుమామిళ్ల చెరువులు నూరు శాతం, జంగాలపల్లె చెరువు 95 శాతం నిండాయి. గణపవరం రక్షిత మంచినీటి చెరువుల్ని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, కౌన్సిలర్లు తులం సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాష, సంతోష్, నాగరాజుతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ మంత్రి విడదల రజిని చొరవతో నియోజకవర్గంలో అన్ని చెరువులు సాగర్ జలాలతో నిండుతున్నాయని తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

చిలకలూరిపేట టౌన్: చెరువులో ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని సోమవారం ఉదయం వెలికితీశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వేలూరు గ్రామానికి చెందిన గండి వంశీ (24) డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం స్నేహితులతో కలసి పక్కనే కుక్కపల్లివారిపాలెం అయినగుంట చెరువులో ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో అతనితో వెళ్లిన ఇద్దరు స్నేహితులు క్షేమంగా ఒడ్డుకు చేరుకోగా, వంశీ చెరువులో గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం వంశీ మృతదేహాన్ని వెలికితీశారు. వంశీ తండ్రి దానియేలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఎకరా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలి

వినుకొండ(నూజెండ్ల) : మండలంలో సాగులో ఉన్న ప్రతి ఎకరాను ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారిణి షేక్ సుగుణా బేగం ఆదేశించారు. నూజెండ్ల రైతు భరోసా కేంద్రంలో రెవెన్యూ, వ్యవవసాయ శాఖ సిబ్బందికి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ–క్రాప్ బుకింగ్ ఆధారంగానే రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల మంజూరుతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ, మద్దతు ధరకు పంట ఉత్పత్తుల కొనుగోలు జరుగుతుందన్నారు. ఈ క్రమంలో సాగు చేస్తున్న పంటల వివరాల్ని నూరు శాతం ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను అనుగుణంగా కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ- కర్షక్‌లో పంటల వివరాలు నమోదు చేయడం వల్ల వ్యవసాయ ప్రణాళికను తయారు చేసేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఈ-కర్షక్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. సిబ్బంది సందేహాల్ని నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

రేషన్, పోషకాహార కిట్ల పంపిణీలో అశ్రద్ధ వద్దు

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ఎంఎల్ఎస్ పాయింట్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: ప్రజలకు సకాలంలో రేషన్ సరుకులతో పాటు ఆహార పదార్థాల కిట్లను ఎంయూడీ వాహనాల ద్వారా ఇంటి దగ్గరే పంపిణీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఎంఎల్ఎస్ పాయింట్‌ను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. గోదాంలో బియ్యం, కందిపప్పు, చెక్కెర, ఇతర ఆహార పదార్థాల వస్తువుల కిట్లు రికార్డుల ప్రకారం ఉన్నయా ..లేదా ? అని క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. ప్రభుత్వం నియమించిన వాహనాల ద్వారా రేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు పనిచేయాలని సూచించారు. గోదాం ఇన్‌చార్జి అధికారికి పలు సూచనలు జారీ చేశారు. వస్తువుల పంపిణీలో తలెత్తుతున్న సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకొని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఎస్.పద్మశ్రీ, జిల్లా మార్కెటింగ్ శాఖ మేనేజర్ డి.వరలక్ష్మి, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు .

మానవ అక్రమ రవాణాను అరికడదాం

సీఐ బ్రహ్మం



మద్దూరు డౌన్ సెంటర్‌లో విద్యార్థుల మానవ హారం

అమరావతి: సమాజంలో ప్రతి ఒక్కరూ మానవ అక్రమ రవాణాని వ్యతిరేకించి, మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హింసల్ని ఖండించాలని సీఐ బ్రహ్మం తెలిపారు. గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక మద్దూరు డౌన్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. పల్లోటి జూనియర్ కాలేజీ, అగస్టీన్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐ బ్రహ్మం మాట్లాడుతూ సెల్‌ఫోన్ ప్రభావంలో పడి ఎక్కువ మంది బాలికలు, మహిళలు మాయగాళ్ల వలలో పడి అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో అమరావతి గ్రామ ఉప సర్పంచ్ నిమ్మ విజయసాగర్‌బాబు, గుడ్ షెఫర్డ్ డైరెక్టర్ సిస్టర్ విన్నారాసి, సిస్టర్ డియానా, సిస్టర్ గ్రేసి, జూనియర్ కాలేజ్ ఫాదర్ వినోద్, కళాశాల ప్రిన్సిపాల్ అగస్టీన్, సుపీరియర్ సిస్టర్ ప్రియా షరీఫ్, సూరిబాబు పాల్గొన్నారు.

ఎన్జీవోస్ మహాసభల్ని విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

సత్తెనపల్లి: విజయవాడలో ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహించనున్న ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర మహాసభల్ని విజయవంతం చేయాలని సత్తెనపల్లి తాలూకా యూనిట్ అధ్యక్షుడు పెండెం మణిరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీవోస్ హోమ్‌లో సోమవారం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణిరావు మాట్లాడుతూ విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న సభలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కూడా పాల్గొంటారన్నారు. రాష్ట్ర మహాసభల్లో ఏపీ ఎన్జీవోస్ బైలాలో కొన్ని మార్పులు జరగవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ నాయకులు కె.నరసింహారావు, అంబేద్కర్, జాన్ వెస్లీ, ఇబ్రహీం, చంద్రకాంత్, కోటేశ్వరరావు, సుభాని, ఖాసిం, సందెపోగు శ్రీనివాసరావు, రవిచంద్ర , శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మలేరియా అధికారులు, విద్యార్థులు

నరసరావుపేట: దోమకాటు.. ఆరోగ్యానికి చేటని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. ఇంటితో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చని ఆయన సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవ ముగింపులో భాగంగా సోమవారం జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి దోమల వల్లే వస్తుందని, ఇంట్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వారానికి ఒకసారి ఇళ్లల్లో నీరు నిల్వుండే ప్రదేశాల్ని గుర్తించి పారబోయాలని చెప్పారు. దోమకాటు రక్షణగా దోమ తెరలను వాడాలని సూచించారు. జ్వరం వస్తే వెంటనే సమీపంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా, డెంగీ పరీక్షలు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలపై హింస, దాడులు అరికట్టండి

ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గద్దె ఉమశ్రీ , నాయకులు

సత్తెనపల్లి: మహిళలపై హింస, దాడులు అరికట్టాలని, మద్యం,మత్తు పదార్థాల్ని నియంత్రించాలని ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 7న సత్తెనపల్లి వస్తున్న మహిళల పోరుయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ ప్రజా సంఘాలతో స్థానిక పుతుంబాక భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడో ఒక మూల రోజూ మహిళలు అత్యాచారాలకు గురవుతూనే ఉన్నారన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారుతోందని తెలిపారు.అనంతరం ఆగస్ట్ 7న సత్తెనపల్లి వస్తున్న మహిళల పోరుయాత్రను జయప్రదం చేయాలని వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జై భీమ్ భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జె.విజయ్ కుమార్, రైతు సంఘం నాయకులు జి. బాలకృష్ణ, పెండ్యాల మహేష్, చేనేత సంఘం జిల్లా కార్యదర్శి వీరబ్రహ్మం, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు జడ రాజకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకురాలు దిగి అమూల్య, సత్తెనపల్లి పట్టణ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ధరణికోట విమల, మునగా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కళ్ల కలకపై జాగ్రత్త అవసరం

రాజుపాలెం: కళ్ల కలక అంటు వ్యాధని, అయినా భయపడాల్సిన అవసరం లేదని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకట కృష్ణకుమార్ తెలిపారు. వ్యాధి వచ్చిన వారు జనాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 24 మందికి వ్యాధి సోకడంతో వేరే విద్యార్థినులకు కొంచెం దూరంలో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కళ్ల కలక వ్యాపించిన వారం రోజుల్లోపు తగ్గుతుందని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు, బట్టలు, టవళ్లు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. జాగ్రత్తలు తీసుకోకపోతే ఎక్కువ మందికి విస్తరిస్తుందని తెలిపారు. ప్రిన్సిపాల్ జోతిర్మయి, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, గ్లోరీ, సీహెచ్‌వో జోత్స్న, ఏఎన్ఎంలు లక్ష్మీతిరుపతమ్మ, సుమ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రకు అవార్డు



నరసరావుపేట: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రల్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డుల్ని అందిస్తోంది. అందులో భాగంగా జూన్ నెల అవార్డుకు సత్తెనపల్లి డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ గజ్జల హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఆరోగ్య మిత్ర గోలి లక్ష్మీ వెంకట సృజన ఎంపికయ్యారు. ఆమె సోమవారం అవార్డును జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ చేతుల మీదుగా కలెక్టరేట్‌లో అందుకున్నారు. అవార్డుతో పాటు రూ.5వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.సునీల, ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఈగా భాస్కర్‌బాబు సేవలు అభినందనీయం



ఈపూరు: పంచాయతీ రాజ్ ఏఈగా భాస్కర్‌బాబు సేవలు ప్రశంసనీయమని పలువురు కొనియాడారు. వాలంటరీ రిటైర్‌మెంటు తీసుకున్న ఆయన్ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిజాయతీకి, నిబద్ధతకి భాస్కర్‌బాబు మారు పేరని, అలాంటి వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం నుంచి విరమణ పొందడం బాధగా ఉందని తెలిపారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చౌడయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, డీఈలు కోటేశ్వరరావు, కొండయ్య, ఎంపీడీవో రంగనాయకులు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో మంగళవారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ తెలిపారు. మండల పరిధిలో 9193 మందికి గాను రూ.2,53,46,250 పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

రైల్వే విద్యుదీకరణ పనుల పరిశీలన

శావల్యాపురం: స్థానిక రైల్వేస్టేషను నుంచి చీకటిఈగలపాలెం రైల్వే స్టేషను వరకు 13 కిలోమీటర్లు నూతనంగా ఏర్పాటు చేసిన డబ్లింగ్ రైల్వే ట్రాక్ విద్యుద్దీకరణ పనుల్ని సికింద్రాబాద్ ఎలక్ట్రికల్ చీఫ్ ఇంజినీర్ వి.డి. మిశ్రా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2న రైల్వే భద్రత అధికారులు, డీఆర్ఎం ట్రాక్ పనుల్ని పరిశీలిస్తారన్నారు. లైన్‌క్లియర్ అనుమతులు జారీ చేసిన అనంతరం రైళ్ల రాకపోకలు కొనసాగుతాయని తెలిపారు. ఆయనతో పాటు రైల్వే అధికారులు, సిబ్బంది ఉన్నారు.

3న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె. మాధ్యూబాబు సోమవారం తెలిపారు. ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సభ్యులందరికీ సర్క్యులర్లు కూడా అందించామని తెలిపారు.